సాక్షి పెద్దపల్లి

గురువారం । 10 । ఆగస్టు । 2023



అంబులెన్స్‌లకు పూజలు

మంథని: మంథనికి మంజూరైన 108, 102 వాహనాలకు సిబ్బంది పూజలు చేశారు. లక్కిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మామిడి సంపత్, చాంద్, హబీబ్, మల్లేష్, శ్రీనివాస్ ఉన్నారు.



ఇన్‌చార్జిలు ఇంకెన్నాళ్లు..!?

మేజర్ గ్రామపంచాయతీ నుంచి ము న్సిపాలిటీగా మారిన మంథనికి ఐదేళ్లు దాటినా కమి షనర్ పోస్టు మంజూరు కాలేదు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి రాణి

పెద్దపల్లిరూరల్: పౌరులందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జూనియర్ జడ్జి రాణి అన్నారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో మాట్లాడారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కనీస విద్య నేర్చుకోవాలని సూచించారు. న్యాయవాదులు శ్రీనివాస్, శంకర్, శ్యాం, సర్పంచ్ జయప్రద, ఎస్సై మహేందర్ తదితరులున్నారు.

రిటైర్డ్ జడ్జి హఠాన్మరణం



లక్ష్మీమనోహర్‌రావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడుకు చెందిన బల్మూరి లక్ష్మీమనోహర్‌రావు బుధవారం హఠాన్మరణం చెందారు. న్యాయవాద వృత్తిలో స్థిరపడిన ఆయన.. కొంతకాలం పెద్దపల్లి, మంథని కోర్టుల్లో న్యాయమూర్తిగా పనిచేశారని న్యాయవాదులు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆకస్మిక మరణంపట్ల బార్‌అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

అండర్ టన్నెల్ త్వరగా పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మారం: మండలకేంద్రం శివారులో ఎస్సారెస్పీ కెనాల్ దిగువ నుంచి వరదనీరు వెళ్లేలా నిర్మిస్తున్న అండర్ టన్నెల్ (యూటీ) పనులను త్వరగా పూర్తిచేయాలని కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. యూటీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. మరమ్మతు పనులు వేసవిలోనే పూర్తిచేయాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా డీ–83 బీ కెనాల్‌కు నీటి విడుదల చేసే అవకాశం లేకుండాపోయిందన్నారు. నాట్లు వేసి నెల రోజులు గడుస్తోందని, ఈ కెనాల్‌పై ఆధారపడిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మహిపాల్, నాయకులు కరిటి వేణుమాధవ్, అరిగే లింగయ్య, కాంపెల్లి రాజేశం, సోగాల తిరుపతి, మహమ్మద్ ఆష్రాఫ్, ఈదుల శ్రీనివాస్, ఉత్తెం రాజయ్య, గౌడ గోవింద్, తుమ్మ నరేష్, సందేనేని తిరుపతి, దొరిశెట్టి నరేష్ తదితరులుపాల్గొన్నారు.

ప్రకృతిపై మమకారం పెంచుకోవాలి



జేఎన్‌టీయూలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

కమాన్‌పూర్: విద్యార్థి దశనుంచే పర్యావరణం, ప్రకృతిపై మమకారం పెంచుకోవాలని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి అన్నారు. నా నేల.. నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఫారెస్టు రేంజ్ అధికారి నాగయ్య, పన్నూర్ సర్పంచ్ అల్లం పద్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుర్గారావు, ఎమరైట్ ప్రొఫెసర్ జగన్నాథ జెట్టి, సదానందం, తిరుపతి, శ్రీధర్, రవి వర్మ, సుమతి, హిరణ్మయి పాల్గొన్నారు.

ఎన్‌సీడీ అధికారిగా మధుకర్‌రెడ్డి



పెద్దపల్లి రూరల్: అసంక్రమిత వ్యాధుల నివారణ (ఎన్‌సీడీ) ప్రోగ్రాం ఆఫీసర్‌గా పీ.మధుకర్‌రెడ్డిని జిల్లాకు నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

- మిల్లులకు కేటాయించిన ధాన్యం భద్రమేనా..?
- మిల్లుల నుంచి మాయం అవుతున్న వడ్లు
- ప్రభుత్వానికి చూపేందుకు బయట నుంచి కొనుగోళ్లు
- సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యంపై పర్యవేక్షణ కరువు



అప్పగించరు..
ధాన్యం చూపరు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. నిర్దిష్ట గడువులోపు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉన్నా.. ఏదో సాకు చెబుతూ వాయిదా వేస్తున్నారనే వాదన సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు. మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటున్న మిల్లర్లు.. రొటేషన్ పద్ధతిన వ్యవహరిస్తున్నారు. సీఎంఆర్ పెట్టిన రైస్ మిల్లులపై అధికారులు ఒత్తిడి పెంచితే తప్ప స్పందించడం లేదు. జిల్లాలో నిర్దిష్ట లక్ష్యానికి అనుగుణంగా మెజార్టీ రైస్ మిల్లు నుంచి ప్రభుత్వానికి సీఎంఆ ర్ అప్పగింతలు పూర్తికావడం లేదు. తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులు మరీ ఒత్తిడి తెస్తే రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. లేదంటే బయట కొనుగోలు చేసిన ధాన్యంతో వాటిని సర్దుబాటు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సుల్తానాబాద్‌లో ఓ మిల్లు నుంచి లారీ ధాన్యం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. విచారణ చేసిన అధికారులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసిన సన్నవడ్లను తరలిస్తున్నారని, ప్రభుత్వం కేటాయించిన ధాన్యం కాదని తేల్చారు. జిల్లాలో ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకుండటంతో మిల్లర్ల వద్ద ఉన్న సీఎంఆర్ ధాన్యం భద్రమేనా..? లేక పక్కదారి పట్టాయా..? అంటే సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. గతంలో కేంద్రబృందం అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు చాలా మిల్లులు సీఎంఆర్ ఇవ్వకపోగా.. కేటాయించిన ధాన్యం బస్తాల్లో తేడాలు వచ్చాయి. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

సన్నబియ్యం తరలిపోతోంది..?

ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కామన్, ఏ గ్రేడ్, సూపర్ ఫైన్ రకాల కింద పండించిన రైతుల వివరాలతో ట్రక్‌షీట్‌లో రాసి మిల్లులకు తరలిస్తుంది. అయితే ఇక్కడే కొందరు మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలిసి చక్రం తిప్పుతున్నారు. కేంద్రాలకు వచ్చిన సన్నరకం ధాన్యాన్ని కామన్ కింద నమోదు చేయించి వాటిని వారివారి మిల్లులకు తరలించుకున్నారు. వాటిని మరాడించిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటునట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన ఆ ధాన్యాన్ని భర్తీ చేయడానికి ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకొచ్చి మరాడించి సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. ఈ విషయం జిల్లా యంత్రాంగానికి తెలిసినా రాజకీయనేతల ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే జిల్లా మేనేజర్ (డీఎం) పోస్టు ఖాళీగా ఉండగా.. డీఎస్‌వోగా బాధ్యతలు నిర్వరిస్తున్న వెంకటేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొద్దిరోజుల క్రితం డీఎస్‌వో బదిలీ కాగా మంచిర్యాల డీఎస్‌వోకు బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో కొత్త డీఎస్‌వో సోమవారం విధుల్లో చేరారు. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో మిల్లర్లు జోరుగా దందా సాగిస్తున్నారు.

సీజన్లు మారుతున్నా చేరని లక్ష్యాలు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు మరాడించేందుకు ఇస్తారు. క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలి. అది కూడా ఒక సీజన్ ధాన్యం తీసుకున్న మిల్లరు మరో సీజన్ ధాన్యం వచ్చే సమయానికి పూర్తిస్థాయిలో బియ్యం బకాయి లేకుండా ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. కానీ.. జిల్లాలో ఇది సక్రమంగా అమలు కావటం లేదు. ఎప్పటికప్పుడు గడువు పెంచుతున్నా మిల్లర్లు మాత్రం స్పందించడం లేదు. ఈయేడాది వానాకాలం సీజన్‌లో 198 మిల్లులకు ధాన్యం కేటాయించగా.. సీఎంఆర్ 16శాతం, యాసంగిలో 132 మిల్లులకు అప్పగించగా.. 9శాతం, గతేడాది వానాకాలంలో 201 మిల్లులకు కేటాయించగా 94శాతం, యాసంగిలో 171 మిల్లులకు ధాన్యం కేటాయించగా 98శాతం ప్రభుత్వానికి సీఎంఆర్ అప్పగించారు.

సీఎంఆర్ వివరాలు (టన్నుల్లో..)

సీజన్	కేటాయించిన ధాన్యం	అప్పగించిన బియ్యం
ఖరీఫ్(22–23)	2,99,757.44	1,69,148.73
రబీ(22–23)	3,50,390.64	2,16,122.33
ఖరీఫ్(21–22)	3,95,431.68	1,54,55.98
రబీ(21–22)	4,00,137.08	6,383.16

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



సీఎంఆర్ లక్ష్యాన్ని గడువులోపు ఇవ్వాలని ఇటీవల మిల్లర్లందరికీ స్పష్టం చేశాం. అక్రమాలకు పాల్పడే మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారికి సహాయపడే అధికారులపైనా వేటువేస్తాం. ఒక మిల్లుకు కేటాయించిన ధాన్యం మరో మిల్లుకు తరలించటం నిబంధనలకు విరుద్ధమే. మిల్లుల్లో ధాన్యం నిల్వలకు సంబంధించి క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తాం.

– జీవీ శ్యాంప్రసాద్, అదనపు కలెక్టర్

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు



చికిత్సకు వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్



లైబ్రరీలో సమస్యలపై ఆరాతీస్తూ

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్ర ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు ఆధునిక పరికరాలను అందుబాటులో ఉంచామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా ఆసుపత్రి ఆవరణలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ, రిజిస్ట్రేషన్, ఓపీ, గైనకాలజీ, ఆరోగ్యశ్రీ, స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులు, వారి బంధువులకు శుద్ధజలం అందించేలా ఆర్ఓ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. రోగులతో మాట్లాడి వైద్యుల పనితీరు, వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఇటీవల డయాలసిస్, టీహబ్ సేవలను అందుబాటులోకి తెచ్చామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్ కలెక్టర్‌కు వివరించారు. ఆర్ఎంఓ డాక్టర్ శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం కండి...

నిరుద్యోగ యవత తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదల, అంకితభావంతో ప్రయత్నించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాకేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి సందర్శించారు. అక్కడ చదువుతున్న యువతతో మాట్లాడారు. గ్రంథాలయంలో వసతులతోపాటు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎస్సైగా ఎంపికైన బొంకూరి మహేశ్‌ను అభినందించారు.

జీజీహెచ్‌లో సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్

- శస్త్రచికిత్స జరిగిన పేషెంట్లకు ఆధునిక వైద్యం
- స్పెషల్ వార్డును ప్రారంభించిన సూపరింటెండెంట్



సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వార్డును పరిశీలిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభు త్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో శస్త్రచికిత్స జరిగిన పేషెంట్లకు ఆధునిక వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలోని రెండో అంతస్తులో కొత్తగా సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ స్పెషల్ వార్డును ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ ప్రారంభించారు. వివిధ శస్త్రచికిత్సలు చేసిన పేషెంట్లను నా ర్మల్ వార్డులోనే అడ్మిట్ చేసిన వైద్యులు.. ఇక నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన సర్జికల్ పోస్ట్ ఆపరేటీవ్ వార్డుకు తరలించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఆర్థో, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, తదితర శస్త్రచికిత్సలు జరిగిన పేషెంట్లను ఈ కేర్ యూనిట్‌లో అడ్మిట్ చేసి.. 48 గంటలపాటు వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ప్రత్యేక వైద్యనిపుణులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆర్ఎంఓలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



మాట్లాడుతున్న ఎంఎస్‌రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం జీడీకే–2వ గనిపై సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్రలో భాగంగా కార్మికులను కలుసుకున్నారు. సింగరేణి సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేట్‌పరం కానీయబోమన్నారు. బొగ్గు ఉత్పత్తితోపాటు కార్మికులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, తాళ్లపల్లి యుగేందర్, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, ధూళికట్ట సతీశ్, సిరిశెట్టి సతీశ్, ఉమ్మెత్తల దేవేందర్‌రెడ్డి, బొంతల లచ్చన్న తదితరులున్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ

క్విట్ఇండియా ఉద్యమ దినాన్ని పురస్కరించుకుని రాజ్‌ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తిప్పారపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు రాజ్‌ఠాకూర్ బుధవారం వినతిపత్రం అందించారు. 23వ డివిజన్‌లో వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని, మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లి ప్రాంతం ఏటా వరద ముంపునకు గురవుతోందని, ఇళ్లు మునుగుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ గృహసముదాయలకు, పక్కా ఇళ్లు నిర్మించాలని కోరారు.

సింగరేణి బొగ్గుకు ఫుల్ డిమాండ్



భూగర్భగని నుంచి బొగ్గును వెలికితీస్తున్న సింగరేణి కార్మికులు

- 16 రాష్ట్రాలకు ఎగుమతి
- విద్యుత్, సిమెంట్, స్పాంజ్ ఐరన్ కంపెనీలకు సరఫరా
- కొత్తగా 160 మంది కస్టమర్లు
- ఈ–యాక్షన్ ద్వారా సంస్థకు రూ.403కోట్ల ఆదాయం

గోదావరిఖని: నవరత్న కంపెనీలతో పోటీ పడుతున్న సింగరేణి సంస్థ దేశంలోనే ప్రత్యేక పేరుప్రఖ్యాతులు సాధిస్తోంది. సంస్థ బొగ్గుకు వినియోగదారుల నుంచి డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తూ లాభాలు సాధిస్తోంది. తొమ్మిదేళ్లుగా బొగ్గు వినియోగదారులు గణనీయంగా పెరిగారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులు సంస్థపై దృష్టి సారిస్తున్నారు. సంస్థ విస్తరించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడుతో సహా 16రాష్ట్రాల్లో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలతో ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో ఉన్న వినియోగదారులకు తోడు ఈఏడాది మరో 160మంది కొత్త విద్యుత్ వినియోగదారులు చేరారు. ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీబొగ్గు బ్లాక్ నుంచి వెలికితీసే బొగ్గును దామోదర్ వ్యాలీ కంపెనీకి విక్రయించడానికి ఒప్పందం చేసుకుంది. కరోనా సమయంలో బొగ్గుకు డిమాండ్ తగ్గిన క్రమంలో వ్యూహాత్మకంగా సంస్థ బొగ్గు ధరను తగ్గించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి మార్కెటింగ్ చరిత్రలోనే అత్యధికంగా 667లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి రికార్డు స్థాయిలో రూ.28,459 కోట్ల అమ్మకాలు జరిపింది. తీవ్ర విద్యుత్ సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో సింగరేణి సంస్థ విద్యుత్ వినియోగదారులకు బొగ్గును నిరంతరాయం అందించడంలో శాయశక్తులా కృషి చేసి వినియోగదారుల నమ్మకాన్ని మరింత పెంచుకుంది.

ఈ–యాక్షన్ ద్వారా రూ.403కోట్ల అదనపు ఆదాయం

2022–23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ వ్యూహాత్మకంగా వ్యవహరించి స్పాట్ ఈ–యాక్షన్ కోసం రెండుమిలియన్ టన్నుల బొగ్గును ఉంచింది. దీనిద్వారా రూ.403కోట్ల అదనంగా ఆదాయం ఆర్జించింది. టన్ను బొగ్గుపై రూ.2వేలు అదనంగా సాధించింది. నాన్‌రెగ్యులేటెడ్ సెక్టార్ సంస్థలకు ఏలక్ట్రానిక్ ప్లాట్‌ఫాం వేదికగా జరిపిన బొగ్గు వేలంలో మంచి లాభాలను గడిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 2.58 మిలియన్ టన్నుల బొగ్గును అమ్మి సంస్థ ఆల్‌టైం రికార్డు నెలకొల్పింది.

బొగ్గు రవాణా (లక్షల టన్నుల్లో..)

విద్యుత్ సంస్థలు	549.69
సిమెంట్ సంస్థలు	52.08
విద్యుతేతర సంస్థలు	117.25

2022-23లో బొగ్గు కొనుగోలు చేస్తున్న రాష్ట్రాలు (లక్షల టన్నుల్లో)

రాష్ట్రం	విద్యుత్	ఇతర సంస్థలు	మొత్తం
తెలంగాణ	303.39	63.79	367.79
ఆంధ్రప్రదేశ్	72.33	22.62	94.95
కర్ణాటక	103.36	21.78	125.14
మహారాష్ట్ర	48.43	3.43	51.86
తమిళనాడు	17.52	2.39	19.91
ఒడిశా	0.00	2.32	2.32
ఛత్తీస్‌గఢ్	0.32	0.12	0.44
మధ్యప్రదేశ్	1.10	0.12	1.22
కేరళ	0.00	0.45	0.45
హర్యానా	1.71	0.00	1.71
ఉత్తరప్రదేశ్	1.14	0.00	1.14
జార్ఖండ్	0.61	0.00	0.61
గుజరాత్	0.00	0.20	0.20
వెస్ట్‌బెంగాల్	0.08	0.00	0.08
గోవా	0.00	0.04	0.04
మొత్తం	549.99	117.26	667.25

'డబుల్' పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ కాంట్రాక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాల్సి ఉన్నందున స్లాబ్, గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. నోడల్ అధికారి నర్సయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మొద్దు



కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు దరిచేరాయి..
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

సుల్తానాబాద్: కాంగ్రెస్ నాయకుల మాయమాటల్లో పడి మోసపోవద్దని, నమ్మితే గోస పడతామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో బీఆర్ఎస్ గ్రామ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, రాజమల్లు, సింగిల్ విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, జూపల్లి సందీప్ రావు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, ముత్యం రమేశ్‌గౌడ్ ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

కాల్వశ్రీరాంపూర్: కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని ఎమ్మెల్యే తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ హయాంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, సాగునీరు అందలేదని, తాగునీటికి కొరత ఉండేదని పేర్కొన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎత్తులను చిత్తు చేయాలి

ఓదెల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఐకమత్యంతో అధికారం కోసం పనిచేయాలన్నారు. పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఎం యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: పీఎంయశస్వి స్కాలర్‌షిప్ కోసం ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులు ఉపకారవేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి తెలిపారు. దరఖాస్తుదారులకు ఓఎంఆర్ పద్ధతిన రాత పరీక్ష ఉంటుందని, అర్హులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో http://yet.nta/ac.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు చివరి అవకాశం


సుధాకర్ రావు

కమాన్‌పూర్: మంథని జేఎన్‌టీయూలో సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 14న చివరి అవకాశమని ఆర్జీ–3 జీఎం తెలిపారు. కళాశాలలో అధికారుల పిల్లలకు 14, ఉద్యోగుల పిల్లలకు 12 సీట్లు కేటాయించామని, మైనింగ్‌లో 6, సివిల్‌లో 6, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 6, కంప్యూటర్ సైన్స్‌లో 1, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఒకటి చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. 14న కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ


శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంకల్ప పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిరుద్యోగ యువతకు నైపుణ్యశిక్షణపై అవగాహన కల్పించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొహెయిల్ ఖాన్, నవీన్‌కుమార్ తదితరులున్నారు.

తాత్కాలికంగా సమ్మె విరమణ


తాత్కాలిక సమ్మె విరమణపై వివరిస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ 34 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మెను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు చొరవతో బుధవారం నుంచి తాత్కాలికంగా విరమిస్తునట్లు కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఖాజా, సీఐటీయూ నాయకులు ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీపీవో చంద్రమౌళిని కలిసి తమ నిర్ణయాలను వివరించారు. నాయకులు అంజయ్య, తిరుపతి, కనకయ్య, రాంచంద్రం, రాజబాబు, గట్టయ్య, అశోక్, రాజయ్య, రవి, శ్రీనివాస్, సంపత్, నగేశ్, సాంబయ్య, శ్రీను, ముస్తఫా తదితరులున్నారు.

ఇన్‌చార్జిలు ఇంకెన్నాళ్లు..!?

- మంథని మున్సిపాలిటీకి మంజూరు కాని కమిషనర్ పోస్టు
- మండల, మేనేజర్ స్థాయి అధికారికే బాధ్యతలు
- ఐదేళ్లలో తొమ్మిది మంది ఇన్‌చార్జిలే..


మంథని మున్సిపాలిటీ కార్యాలయం

మంథని: మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన మంథనికి ఐదేళ్లు దాటినా కమిషనర్ పోస్టు మంజూరు కాలేదు. ఐదేళ్లుగా అయితే మండలస్థాయి, లేదా మున్సిపాలిటీ మేనేజర్లకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌చార్జి కమిషనర్లతో కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన తొమ్మిదిమంది కూడా ఇన్‌చార్జి కమిషనర్లు కావడం గమనార్హం. తాజాగా అమనగల్లు మున్సిపాలిటీ మేనేజర్‌గా పనిచేస్తూ.. అదనపు విధుల కింద ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న సీహెచ్.సతీషన్‌ను మంథని మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్‌గా నియమించారు.

మొదటి నుంచీ అంతే..

- 2018 ఆగస్టు 2న మంథని మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది.
- అప్పటి మంథని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటచైతన్యకు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు.
- 2019 జనవరి 12 నుంచి జనవరి 31 వరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.
- ఫిబ్రవరి ఒకటి నుంచి 20 వరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు చూశారు.
- 2019 ఫిబ్రవరి 24న కాగజ్‌నగర్ మున్సిపాలిటీ మేనేజర్ గుట్టల మల్లికార్జున్‌ను ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు.
- ఆయన 2020 మార్చి 18న సస్పెన్షన్‌కు గురయ్యారు.
- ఆయన స్థానంలో అప్పటి మంథని తహసీల్దార్ అనుపమరావుకు బాధ్యతలు అప్పగించగా.. 2020 సెప్టెంబర్ 20 వరకు కొనసాగారు.
- తర్వాత తహసీల్దార్ వేణుగోపాల్ డిసెంబర్ 18 వరకు ఇన్‌చార్జిగా పనిచేశారు.
- అనంతరం మేనేజర్ స్థాయి అధికారి శ్రీనివాస్ రెడ్డి డిసెంబర్ 18 నుంచి 2022 జనవరి 14 వరకు విధుల్లో కొనసాగారు.
- ఆయన బదిలీ కావడంతో జనవరి 14న మేనేజర్ యు.శారదకు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు.
- ఆమె ఈనెల 4(శుక్రవారం) వరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించారు.
- ప్రస్తుతం సీహెచ్.సతీష్‌కు పూర్తిస్థాయి కమిషనర్‌గా నియమించగా.. ఆయన విధుల్లో చేరారు. ఇలా ఐదేళ్లలో తొమ్మిది మంది ఇన్‌చార్జి కమిషనర్లతోనే ప్రభుత్వం మున్సిపాలిటీ పాలనను నడిపిస్తోంది.

మున్సిపాలిటీలో అనేక వివాదాలు

మంథని మేజర్ గ్రామపంచాయతీ మొదలు ప్రస్తుత మున్సిపాలిటీ వరకు లీజు భూముల వివాదం కొనసాగుతోంది. ఆర్టీసీ బస్టాండ్ వెనుకభాగంలో ఉన్న మున్సిపల్ స్థలాల వివాదంపై అప్పట్లో కార్యదర్శులపై వేటు పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. అనేకమంది బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. లీజు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని మంథనికి చెందిన పలువురు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల అమలులో అధికారులకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమిస్తేనే ఇలాంటి వివాదాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కదం తొక్కిన ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు



ఏడీఎం గేట్ వద్ద నిరసన చేపట్టిన కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు,మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు కదం తొక్కారు. అలవెన్స్ పెంపు ఒప్పందం ఏడాదికాలంగా జాప్యం కావడం.. 33 సార్లు చర్చలు జరిగినా ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు, కార్మికులు బుధవారం ఉదయం షిఫ్టు నుంచి విధులు బహిష్కరించారు. లేబర్ గేట్ నుంచి పరిపాలనా భవనం గేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం రహదారిపై బైఠాయించారు. వీరికి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మద్దతు తెలిపారు. కార్మికుల ఆందోళన న్యాయమైందని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని యాజమాన్యానికి సూచించారు. వారి న్యాయమైన సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ కోరారు. ఏడీఎం గేట్ వద్ద చేపట్టిన నిరవధిక ధర్నాలో కార్మికులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వేతన ఒప్పందాన్ని జాప్యం చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి అన్నారు. చర్చలు కొనసాగించకుండా మెరుగైన ఒప్పందం చేయాలని సూచించారు. అలవెన్స్, ఇతర డిమాండ్లపై ఇచ్చిన నోటీస్ ప్రకారం చర్చించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ప్రశ్నించారు. కార్మికులకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోలివాడ ప్రసన్నకుమార్ తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, ఎం.శంకర్, నాగభూషణం, గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి వైద్యానికి సాయం


బాధితుడికి నగదు అందిస్తున్న సొసైటీ సభ్యులు

ధర్మారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి.. మంచానికే పరిమితమైన మండలకేంద్రానికి చెందిన గండికోట శ్రీనివాస్‌కు సింగపూర్‌లోని తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.2.40లక్షలను బుధవారం సొసైటీ సభ్యులు అందించారు. పదినెలల క్రితం శ్రీనివాస్, మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించారు. శ్రీనివాస్ చేయి, కాళ్లు విరిగిపోయాయి. ఆసుపత్రికి తరలించగా చేయిని భుజం వరకు తొలగించారు. ఓ కాలుకు రాడ్లు వేశారు. అప్పటినుంచి మంచానికే పరిమితమై.. ఆర్థిక సమస్యతో చికిత్స కోసం ఇబ్బంది పడుతున్నాడు శ్రీనివాస్. సింగపూర్‌లో ఉంటున్న మిత్రుడు గుర్రం లక్ష్మీపతి ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ కల్చరల్ సొసైటీ సభ్యుల పిలుపు మేరకు దాతలు విరాళాల రూపంలో రూ.2.40లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని సొసైటీ సభ్యుడి తండ్రి బక్కయ్య ద్వారా శ్రీనివాస్ తల్లికి అందించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శి గడప రమేశ్, బసిక ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోనె నరేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు మాదారపు సంతోష్, పెరుకు శివరాంప్రసాద్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఒకేరోజు ఇద్దరు యువకుల మృతి

- అనారోగ్యంతో ఒకరు..
- గుండెపోటుతో మరొకరు
- ఈసాలతక్కళ్లపల్లిలో విషాదం


సాతిని నిఖిల్ (ఫైల్)


రెడపాక మహేశ్ (ఫైల్)

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన సాతిని నిఖిల్ (23) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన భూశంకర్ ప్రైవేటు బస్సు డ్రైవర్. ఆయన కుమారుడు నిఖిల్ మూడు రోజుల క్రితం అనారోగ్యంబారిన పడగా.. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి నానమ్మ సాతిని రాజమ్మ 20 రోజుల క్రితం గుండెపోటుతో చనిపోవడం ఆ ఇంట్లో విషాదం నిండింది. ఇదే గ్రామానికి చెందిన రెడపాక మహేశ్ (30) గుండెపోటుతో మరణించాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మహేశ్ తన మిత్రుడితో కలిసి బుధవారం బైక్‌పై పెద్దపల్లికి వెళుతుండగా.. మార్గంమధ్యలో బైక్‌పై ఉండగానే గుండెపోటుకు గురై స్పృహతప్పి పడిపోయాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఒకేరోజు వేర్వేరు కారణాలతో ఇద్దరు యువకులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పరామర్శించారు.

లారీని ఢీకొన్న కారు


సంఘటన స్థలం వద్ద గుమిగూడిన ప్రజలు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో వేగంగా వచ్చిన కారు లారీని వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టి కొంతదూరం లాక్కెళ్లింది. రాజీవ్‌రోడ్డుపై బుధవారం జరిగిన ఈ ఘటన చూసిన వారంతా భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. పోలీసులు చేరుకుని కారును పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

మంథని: మంథని మండలం ఎక్లాస్‌పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన నాంపల్లి రాజేందర్ గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజేందర్ పొలం నుంచి బుధవారం ఇంటికి వెళ్తూ మంథని–కాటారం ప్రధాన రహదారి దాటుతుండగా మంథని వైపు నుంచి వరంగల్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో రాజేందర్ కాలుకు బలమైన గాయం కావడంతో మంథని ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ తరలించారు.

ఆయన నేత్రాలు సజీవం


వెంకటరెడ్డి(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి మాజీ హెడ్ ఓర్‌మెన్ జూల వెంకటరెడ్డి (65) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

క్విట్ ఇండియా వేడుకలు


వేడుకల్లో నాయకులు

గోదావరిఖనిటౌన్: జాతిపిత మహాత్మాగాంధీ సారథ్యంలో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం 81 వసంతాలు పూర్తయిన సందర్భంగా గాంధీ స్మారక నిధి హైదరాబాద్, నేషనల్ యూత్ ప్రాజెక్టు సంయుక్తంగా ఆరు జిల్లాల్లో వార్షికోత్సవాలను నిర్వహిస్తోందని ఎన్‌వైపీ అధ్యక్షుడు యాదవరాజు అన్నారు. బుధవారం స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యాలయంలో క్విట్‌ఇండియా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జ్యోతి, డాక్టర్ లక్ష్మీవాణి, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను వీడితేనే కష్టాలు దూరం

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మధు

మంథని: కాంగ్రెస్‌లో జెండా మోసినవారికి, పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉండదని, ఆ పార్టీని వీడితేనే కష్టాలు దూరమవుతాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బుధవారం మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఇసంపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గొర్రెపల్లి సురేశ్, యూత్ అధ్యక్షుడు ఉడుత సంజీవ్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ దండె ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధు మాట్లాడారు. కాంగ్రెస్‌లో బానిసలుగా బతకొద్దని, వారంతా బయటకు రావాలని సూచించారు. మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బొగ్గు పరిశ్రమను రక్షించుకుందాం

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


నల్లబ్యాడ్జీలు పెడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ సంస్థలు, బొగ్గు పరిశ్రమ, సింగరేణిని రక్షించుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అన్ని గనులపై సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మన సింగరేణి బొగ్గు బ్లాకులను మనకే కేటాయించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి పర్మినెంట్ చేయాలన్నారు. గురువారం ఉదయం 10గంటలకు స్థానిక మెయిన్‌చౌరస్తాలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు మెండె శ్రీనివాస్, గజేంద్ర, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

వైరల్‌గా మారిన గెస్ట్‌హౌజ్ సీసీ పుటేజీ


సీసీ పుటేజీలో కనిపిస్తున్న దృశ్యాలు

గోదావరిఖని: సింగరేణి అధికారి ఒకరు ఓ మహిళతో గెస్ట్‌హౌజ్‌లో వ్యవహరించిన తీరుకు సంబంధించిన సీసీ పుటేజీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. క్యాంటీన్‌కు చేరుకున్న మహిళతో సదరు అధికారి వాగ్వాదానికి దిగినట్లు వీడియోలో కనిపిస్తోంది. ఆ మహిళ సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించగా.. ఫోన్‌ను విసిరికొట్టడంతో అది పగిలిపోయినట్లు తెలుస్తోంది. మూడురోజుల క్రితం జరిగిన ఈ సంఘటన సీసీ పుటేజీ వైరల్‌గా మారడంతో సింగరేణి వ్యాప్తంగా దీనిపైనే చర్చించుకుంటున్నారు. దీంతో సదరు అధికారి లాంగ్‌లీవ్‌లో వెళ్లినట్లు తెలుస్తోంది. ఘటనపై సింగరేణి ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు ఘటనపై పలు రకాలుగా ప్రచారం జరుగుతోంది. సదరు అధికారి భార్య ఎమ్మెల్యేగా బరిలో ఉంటుందనే అసూయతోనే ఇదంతా చేస్తున్నారని అధికారి వాపోతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది అధికారుల మధ్య విభేదాలతోనే ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని అంటున్నారు.

ఆహారధాన్యాల సరఫరాలో ఎఫ్‌సీఐ అగ్రగామి


మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ మేనేజర్ చంద్రమోహన్

- ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ చంద్రమోహన్

పెద్దపల్లిరూరల్: ఆహారధాన్యాల సరఫరాలో ఎఫ్‌సీఐ అగ్రగామిగా నిలిచిందని సంస్థ పెద్దపల్లి డిపో మేనేజర్ ఏ.చంద్రమోహన్ తెలిపారు. దేశంలో ఎఫ్‌సీఐ పాత్రపై గోదాముల వద్ద బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. గోదాముల్లో ఉన్న నిల్వలకు లోటు ఏర్పడే రాష్ట్రాలకు తక్షణమే సరఫరా చేసి ఆహార కొరతను తీర్చడంలో ఎఫ్‌సీఐ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని వివరించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు సేకరించిన ధాన్యం ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఉంటాయని పేర్కొన్నారు. కరోనా లాంటి ఆపత్కాలంలో ఆహార కొరతను ఎఫ్‌సీఐ అధిగమించిందన్నారు. పెద్దపల్లిలో 1974లో 16,617 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు స్థాపించబడ్డాయని తెలిపారు. సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రాంతాల రైతుల నుంచి మద్దతు ధరకు సీఎంఆర్ ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. పోషకాహార లోపాలను అధిగమించేందుకు పోర్టిఫైడ్ రైస్ సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. పిల్లలు, పెద్దలు పోషకాహారలోపంతో అనారోగ్యాల పాలు కాకుండా పోషకాలు, విటమిన్లతో కూడిన పోర్టిఫైడ్ రైస్ ఎఫ్‌సీఐ ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బియ్యం సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, ల్యాబ్ నిర్వహణ, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో నాణ్యతా విభాగం అధికారులు ఎం.మురారి, వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడులకు నిధులు

- తొలి విడత రూ.75,27,500 విడుదల
- ఆయా పాఠశాలల ఖాతాల్లో జమ

సుల్తానాబాద్: సర్కారు బడుల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయిస్తోంది. 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభంలోనే నిధులు మంజూరవటంతో సమస్యలు తీరినట్లయ్యింది. గతేడాది మధ్యలో.. చివరన 50 శాతం చొప్పున రెండుదఫాలుగా నిధులు అందాయి. ఈ ఏడాది ఆరంభంలోనే 50 శాతం నిధులను ప్రభుత్వం మంజూరు చేయటం గమనార్హం. పాఠశాలల నిర్వహణతోపాటు క్రీడలకు సైతం నిధులు వేర్వేరుగా విడుదల చేసింది. జిల్లాలోని 510 పాఠశాలల ఖాతాల్లో రూ.75,27,500 జమ కానున్నాయి.

ఈసారి త్వరగా..

గతంలో పాఠశాలలకు సకాలంలో నిధులు విడుదల కాక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నిధులతోనే విద్యుత్ బిల్లులు, డస్టరు, సుద్దముక్కలు, తెల్ల కాగితాలు, హాజరు పట్టికలు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ప్రాజెక్టర్ల నిర్వహణ తదితర సామగ్రి కొనాల్సి ఉంటుంది. పరీక్షలు, జాతీయ పండగల నిర్వహణ, ప్రయోగశాలలకు పరికరాలు సమకూర్చుకోవాలి. ఈ క్రమంలో నిధులు విడుదల కావడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. క్రీడల కోసం ప్రాథమిక పాఠశాలలకు రూ.5వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10వేల చొప్పున మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయటం శుభ పరిణామమని డీఈఓ మాధవి, తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1976–77లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఒకచోట కలుసుకున్నారు. తోటి స్నేహితులు హనుమంతు, సత్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ చాటిన 8, 9, 10 వతరగతుల విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. పూర్వ విద్యార్థులు లయన్స్ క్లబ్ ప్రతినిధి కొల్లూరి ఆనందం, సత్యనారాయణ రెడ్డి, కృష్ణకుమార్, రంగారావు, సదానందం, విజయపాల్ రెడ్డి, హనుమంతు, వెంకన్న, కృష్ణమూర్తి, అశోక్ రెడ్డి, రాజమల్లయ్య, శశికాంత్ రెడ్డి, జీవీ.రమణారెడ్డి, జనార్ధన్, చంద్రశేఖర్, హరిప్రసాద్, మాధవరెడ్డి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం


సన్మానిస్తున్న సోమారపు సత్యనారాయణ

గోదావరిఖని: నామట్టి, నాదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక జవహర్‌నగర్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో మాజీ సైనికులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, పిడుగు క్రిష్ణ, సోమారపు లావణ్య, వడ్డేపల్లి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.